వ్యాస కౌముది

# వెలుగుల వాకిళ్ళు

చంద్ర లత



"ఇరు సంజలు రంగుల వాకిళుల్ " అంటూ అంతము లేని ఈ భువనాన్ని అనుసృజించారు దువ్వూరి వారు. అయితే, ఈ ఇరువురు మహానుభావుల గురించి ఏ కొద్దిగా తెలిసిన వారైనా, నెల్లూరుసీమ లో మొలకెత్తిన దేదీప్యమానమైన వెలుగు వాకిళ్ళు వారేనంటారు. వారిరువురు మహనీయులు పొణకా కనకమ్మ గారు (1892 –1963) . దువ్వూరి రామిరెడ్డి గారు (1895–1947).



ఆ దీపధారులిద్దరినీ ఒకే వేదిక మీద ఈ రోజు స్మరించుకొంటున్నాం. సవినయంగా. సగౌరవంగా.

ఇదే రోజున నూట ముప్పైరెండేళ్ళ క్రితం ,1892లో పుట్టినవారు శ్రీమతి పొణకా కనకమ్మ గారు.

"ఆమె పేరు కనకమ్మ.
చూపులకెట్లనో భావాల కట్లా.
ఆదర్శాలకెట్లనో ఆచరణలకట్లా.
ఈనాడామె రైతాంగపు కనకమ్మయే! "

అంటూ కనకమ్మ గారనే బంగరుకణికను పరిచయం చేస్తారు ఆచార్య ఎన్.జి.రంగా గారు.(1939,వాహిని).అదే వ్యాసంలో రంగా గారు చాలా ప్రముఖంగా రాశారు. కనకమ్మ గారి ఇంటనే పుట్టిన మరొక నిప్పుకణిక గురించి. అది,"మా కొద్దీ జమీందారీ పొందు" అన్న నినాదం. జమీన్ రైతు పత్రిక స్థాపనకు,జమీందారీ వ్యవస్థ వ్యతిరేక ఉద్యమానికి ఆ వాక్యం పొలికేక అయ్యింది. జమీందారీ వ్యవస్థ నే తిరగరాసింది.

అలాంటి కార్చిచ్చుకు నిప్పురాజేసిన కనకమ్మ గారు, తమ స్వీయచరిత్ర పీఠికలో,తను పుట్టి పెరిగి,మెట్టిన నేల నెల్లూరు సీమ ను ఇలా పరిచయం చేస్తారు.

"వేదవృక్షాలపై కవికోకిల అసమానమైన తీయని పాటలు పాడుకొన్నదిచటనే! "

అయితే, ఆ కవికోకిల దువ్వూరి రామిరెడ్డి గారు తమను తాము ఒక సామాన్య పల్లెటూరి రైతులాగా పరిచయం చేసుకొంటారు.

" గ్రామవాసిని. ఎఱుగను కైతవంబు
ప్రకృతి తల్లి స్తన్యంబున ప్రబలినాడ.
పొలముల విహరించుచు ప్రొద్దు పుచ్చుచుందు." (కవితా ప్రణయిని, నక్షత్ర మాల 1918-21)

చిన్నప్పుడే నాకు వారిరువురి పరిచయం కలిగింది. అదీ మా నాన్నగారి వలననే. కృషీవలుడు మా ఇంటి సభ్యుడు. నాన్నగారు, కోటపాటి మురహరి రావు గారు, ఎంతగా దువ్వూరి వారి కర్షక సాహిత్యాన్ని అభిమానించే వారంటే, నాన్నగారు తీసిన సినిమా బ్యానర్ పేరు "కృషీవలా ఫిలిమ్స్."

ఇక, నాన్న గారు కావూరు వినయాశ్రమవాసి గా ఉన్నపుడు, 1955ప్రాంతాలలో, నెల్లూరు కు వచ్చి, పొణకా కనకమ్మ గారిని స్వయంగా కలిశారు. వినయాశ్రమం కార్యకలాపాల గురించి చర్చించడానికి . అప్పుడు వారు బస చేసింది వెన్నెలకంటి రాఘవయ్య గారి ఇంటి పంచన. అలా, వారందరి విశేషాలు, వారి అవిశ్రాంత కృషి మా ఇంట్లో తరచూ ఎంతో గౌరవంగా, అభిమానంగా ప్రస్తావనకు వస్తుండేవి. ఇక, 'పవలు నడుచు బ్రొద్దు,తొవవిందు రేవేళ / పవలు రేయి పెరుగు పాడు వడ్డీ'(కృషీవలుడు ,1919) అని మరిచిందెప్పుడు?

కాళిదాసు పురుషోత్తం గారు పరిష్కరించిన, కనక పుష్యరాగానికి చాలా ముందే ,మా ఇంట్లో కనక పుష్యరాగాలు వెలుగులు చిమ్ముతున్నాయి. అలా,ఒక ఉద్వేగభరితమైన బాంధవ్యం ఆ ఇరువురి తో నాకు.

"కృషి సకల పరిశ్రమలకు కీలుచీల " అని గడగడ అప్పజెప్పగలగడమే కాదు, "కావున కృషీవలా, నీవే కారణమవు సాంఘికోత్కృష్ట సౌభాగ్య సౌఖ్యములకు " అని పొంగిపోతూ ," ఫలమునుభవించు వారలు పరులు," అని వాపోతూ- " " నీకు కట్ట కుడవను కఱవె యెక్కాలమందు!"అంటూ -స్వాభిమానంతో తలెత్తి నిల్చుంటాను. నేనే కాదు. రైతు కుటుంబాల్లో పుట్టి పెరిగిన ఏ బిడ్డ అయినా, అంతేనేమో మరి! (కృషీవలుడు ,1919)

అయితే, దువ్వూరి వారి రచనలలో నాకు నచ్చినవి మరికొన్ని ఉన్నాయి.

అందులో మొదటిది 'నక్షత్ర మాల' ,ఖండకావ్యంలోని (1918-21) 'కవితాప్రణయిని' లోని ఈ పద్యపాదాలు .

" సాలెగూళులు ముత్తెంపుసరములటుల
లేతగాలికి నల్ల చలించు మంచు

నీటిబొట్ల మాలను గట్టి నీదు మెడను
వైవ తలబోసి యెగతాళి పడితి చెలియ" (కవితా ప్రణయిని,నక్షత్ర మాల 1918-21)

చూశారా? ఆ రైతు కవి చూపుతోన్న గట్టు మీది సాలెగూళ్ళ చిక్కిన తెల్లవారురుఝాము మంచుబిందువుల తళుకుల సౌందర్య దృశ్యం. నిజమే, మంచునీటి బొట్లు ఏ వజ్రవైఢూర్యాలకు తక్కువ! తన ప్రేయసికి మంచుపూల హారంగా గుచ్చి ఇవ్వాలని తలపోసి, ఆ ఊహని ఎలా యెగతాళి చేసారో అదీ చెబుతున్నాడు కవి.

అంతెందుకు? ఈ 'గఱిక' ను ఇలా చూడండి.

"దారి కోవల క్రేవ తనరారు గఱిక ,
యెంత మెత్తందన!మెంతటి ప్రోది!
యెంత క్రొత్తందన మిగురొత్త నీవు
మొన్నగా కురిసిన ముత్యాల జడికి
మురిపాల గుబురువై పెరుగుచున్నావె?
.................................................
గుస గుస చెప్పెదు,గునిసి యాడెదవు.
..............................................
నొక వేళ నిరువుర నొకరమే యేమొ! (గఱిక,నైవేద్యము, 1921-25)

ఆహా, గునుస్తూ గుసగుసలాడే గఱిక, తాను ఒకటేనని తలపోయగలిగాడు కదా ప్రకృతిలో మమేకమైన ఆ కవి! గఱిక లో వెలిగెడి నిర్మలజ్యోతిని చూడగలిగిన ఇంతటి సున్నిత మనస్కుడికి కలిగిన కష్టం నష్టం ఎంతని చెప్పగలం?

"పిందె పుట్టిన నశియించు పువ్వువలె,తల్లియు మరణించెను. ఆ పిందె కూడా రాలిపోయెను." (20-8-1926,డైరీ)

పిన్న వయస్సు లోనే భార్యాబిడ్డలను పోగొట్టుకొన్న దువ్వూరి వారు ,"కొంత సుఖించి పోయిరెటకో" అన్న వైరాగ్యభావన ముంచెత్తిన విషాదకాలపు ఖాళీల్లో, తాత్విక భరితమైన ఉమర్ ఖయ్యాం రుబాయత్ లను " పానశాల " గా అనుసృజియించారు. పారశీకం నేర్చుకొని. అచ్చంగా తెలుగులో రాసినదనే అనుకొనేట్టుగా లిఖించి, తన కష్టసుఖాలను పంచుకొని కాలంలో కలిసిపోయిన సతికి అంకితమిచ్చారు. (పానశాల,రచన 1926-27,ప్రచురణ: భారతి 1928)

అక్షరాలే దువ్వూరి వారికి ఓదార్పు. ఉపశమనం.

కనకమ్మ గారి అనుభవమూ అంతే. భర్తను,కన్నబిడ్డను, నిర్మించుకొన్న సంస్థను పోగొట్టుకొన్నారు. ఆ రూపేణా వారు పువ్వునూ,పిందెనూ, స్వయంగా నాటి, పెంచిన కస్తూరి వనాన్ని కోల్పోయారు.

వారి దుఃఖానికి ఉపశమనం మాట అటుంచితే, వారిలో దుఃఖానికి తావే లేదు!

పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకొని , తలెత్తి నిలబడ్డ వ్యవహర్త. ధీరచిత్తయై ఒంటి కాలి నిలబడి,కొంగు బిగించి, వ్యవహారాన్ని తన చిత్తంగా మలుచుకొంది. "నా జీవితంలో సత్యం ,ధర్మం, పరమ విధిగా భావించితిని. నేను చేసినంత వరకు మనస్సాక్షికి వ్యతిరేకంగా నడుచు కొన్నది లేదు. నా ఆరోగ్యము వల్ల ఇంకా నేనీ సంస్థలకు చేయవలసినంతగా చేయలేకపోయితినని భావిస్తున్నాను." (1)

అదీ పొణకాకనకమ్మ గారంటే!

కణకణ నిప్పుల్లో తేజోదీప్తమైన పసిడి తునక కనకమ్మ గారు!

జీవితం పుటం పెట్టిన కొద్దీ, మెరుగుపడ్డ బంగారు తల్లి!

★

అది పరాయి పాలన. మద్రాస్ ప్రెసిడెన్సీ లో జమీందారీ యుగం.

సమకాలీనులైన ఇద్దరు విజ్ఞులు ఒకరికి ఒకరు నిశ్శబ్ద ప్రేరణ అవుతూ , మర్యాదబద్ధమైన గౌరవాన్ని,తోడ్పాటును ఎలా అందించుకొన్నారో అన్న ఊహకే ,వారి పట్ల మరింత గౌరవం కలుగుతుంది. వారి వారి రంగాలలో, వారి నిబద్ధ కృషితో ఉన్నత ప్రమాణాలను నిలిపి వెళ్ళిన ఉత్తములు.

కర్షకుడి ఉనికికీ, ఆత్మ గౌరవానికి 'కృషీవలుడు' పర్యాయపదమైతే, ముల్లుగర్ర తీసుకొని ఆ ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది ...కనకమ్మ తలబెట్టిన జమీన్ రైతు ఉద్యమం ,మొదలెట్టిన జమీన్ రైతు పత్రిక.

"అవ్వా! ఆ పొలములో కొంత గ్రంథాలయమునకు మరి కొంత పాఠశాలకు వ్రాయించెదను" అని 'కర్షక విలాసము'(1916) నాటకంలో దువ్వూరి వారి పాత్ర అంటే...

వారి పొలం పుట్రలను నగానట్రలను ధారాళంగా విరాళాలు ఇచ్చిన వారు కనకమ్మ గారు. ఇచ్చి ఊరుకోలేదు. సంస్థలు స్థాపించి, నడిపించారు. పోరాటం చేశారు. సమాజ గతినే మార్చారు.

ఇక, "కనకమ్మ గారి బాలికా పాఠశాలకు విరాళం కొరకు 'చిత్రనళీయం' ను ప్రదర్శించిరి."(15-2-1926 ) అని దువ్వూరి వారు తమ డైరీ లో రాశారు . 'చిత్రనళీయం' నాటక రచయిత దువ్వూరి వారు.(5)

వందలాది ఎకరాల జమీందారిణి ఒక సంస్థను నడపడానికి విరాళాలను సేకరించ వలసిన పరిస్థితులను దువ్వూరి వారు గ్రహించ లేక పోలేదు.

పెద్ద రైతు లైనా చిన్న రైతులైనా ,కృషివలుర సమస్యలు సమస్యలే. వ్యవసాయమైనా వ్యవహారమైనా ... పల్లె అయినా పట్నమైనా ... "బూటకములు, కుయుక్తులు ,మోసగతులు

కోర్టువ్యాజ్యాలు,ఫోర్జరీల్,కూటమైత్రి ,

స్వార్థ పరత ,మౌఢ్యంబు, గర్వప్రవృత్తి,
నేర్పు విద్యాలయంబులు నేటి యూళ్ళు! " (కృషీవలుడు ,1919)

అటువంటి విద్యాలయాల చీకట్లను దిగమింగి, వాటి వాకిట్లో ఒక చిరుదివ్వె ను వెలిగించిన వారు కనకమ్మ గారు.

★

“ఉప్పుతో తొమ్మిది యున్న కాపురంబులు
చేయు గృహిణులకే చిక్కు లేదు " అని దువ్వూరి గారు ప్రస్తావించారు. అయితే, ఆ తొమ్మిందింటిని సమకూర్చుకొంటూ ,ఇంటిని చక్క దిద్దినట్లు, సంస్థలను,ఉద్యమాలను , ఆ దరిమిలా సమాజాన్ని చక్కదిద్దడానికి పూనుకోవడం ,ఎక్కడికక్కడ చిక్కుముళ్ళే కదా?

చిన్న కమతాల సామాన్య రైతు కయినా,వందలాది ఎకరాల మోతుబరికయినా అది సవాలే.

ఆ కష్టనష్టాలను ఎరిగిన వారు దువ్వూరి వారు. వారి కలం కర్షకుడి హలం అయితే, ఆ అష్టకష్టాల పద్మవ్యూహాలను ఎదురొడ్డి, సమర్థించి నిలబడ గలిగిన నేర్పుగల విదుషీమణి పొణకా కనకమ్మ గారు.

‘కలుపుతీత మాసం తన కవితా మాసం’అన్నారు దువ్వూరి వారు.

"ఏ ఉన్నతిని పొందడానికైనా విద్య ముఖ్య కారణం" అని నమ్మిన కనకమ్మ గారు. తాను పండిస్తోన్న చదువుల పంటలో కలుపు మొక్కలను పీకి, పక్కన వేసి, మరొక కమతం దున్నించి, దుక్కి చేసిన వారు. నాలుగు దశాబ్దాలకు పైగా నారుపోసి, నీరు పోసి పెంచి పెద్ద చేసిన విద్యావనాన్ని వదల వలసి వచ్చినపుడు, ఆమె ఊరుకున్నారా? మరొక విద్యాబీజాన్ని నాటారు.ఒక పారిశ్రామిక శిక్షణాసంస్థను నెలకొల్పారు. విజయవంతంగా నడిపి, నిలదొక్కుకొన్నారు.

"స్త్రీలు సంకల్పిస్తే ఎంత పనినైనా చేయగలము"అని చెప్పిన వారు. అంతటి పనిని చేసి చూపిన వారు.

పొద్దు పొడిచిన దగ్గర నుంచి పొద్దు గూకేదాకా, కాయకష్టం తో అలసి సొలసి పోయావేమో ,
"విశ్రమింపుము సైరికా, వేగు వఱకు" అని కృషీవలురతో దువ్వూరివారంటే,
"కొంతకాలం తమస్సులో నిద్ర పోయినాము .ఇక మన గమనానికేదీ అడ్డు రాకూడదు" విశ్రమించకు బాలికా,వేగువఱకు అని కనకమ్మ గారంటున్నారు.

ఆ వెలుగుల వాకిళ్ళలో నిలబడి నవ్వుతూ ! ఇరువురూ!

★

ఆ దీపధారులిద్దరికీ వందనాలు. దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి ,నెల్లూరు వారికి ధన్యవాదాలు.

★

డా. చంద్ర లత, ప్రసంగ పాఠం,

10-6-2024, పొణకా కనకమ్మ జయంతి సభ, దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి, నెల్లూరు.

★

**ఆధారిత రచనలు:**


1. కనక పుష్య రాగం, పొణకా కనకమ్మ స్వీయ చరిత్ర, సంపాదకులు : డా. కాళిదాసు పురుషోత్తం గారు.
2. కవికోకిల గ్రంథావళి , శతజయంతి సంపుటి ,1 & 2,ప్రచురణ: దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి,నెల్లూరు
3. కవికోకిల శ్రీ దువ్వూరి రామిరెడ్డి, కిరణ్ ప్రభ, (యూ ట్యూబ్ 29-6-2022)
4. నెల్లూరు విప్లవ కణిక, పొణకా కనకమ్మ,కిరణ్ ప్రభ, (యూ ట్యూబ్ 1-11- 2023)
5. Analysisi-of-Chitranalineeyam-Telugu-Natakam, Dr.M.Manju Sri


★